క్లుప్తంగా

యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మున్నంగి(కొల్లిపర): యోగాలో పి.జి, డిగ్రీ లేదా డిప్లొమా చేసి అనుభవం కలిగిన అభ్యర్థులు యోగా శిక్షకులుగా పనిచేయుటకు ఆసక్తి కలిగిన స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవాలని మున్నంగి ఆయుర్వేద వైద్యాధికారి డాక్టరు టి.సాయి కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మున్నంగి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్–ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో యోగా శిక్షకులు అనివార్య కారణాలతో ఉన్న వారు మానుకోవటం వలన కొత్తగా అవసరమై ఉన్నందున ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు శిక్షకుల అభ్యర్థుల నియమానికి అర్హత ఉన్న వారిదగ్గర నుంచి దరఖాస్తు కోరుచున్నట్లు తెలిపారు. అర్హత పొందిన వారు ఒక నెలయందు స్త్రీ యోగా శిక్షకులకు 20 గంటలు, పురుష యోగా శిక్షకులు 32 గంటలు శిక్షణ తరగతులను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. దీనికి ప్రతి గంటలకు రూ.250 చొప్పున గౌరవ వేతనం ఇస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఇతర వివరముల కోసం 9391399194 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

తెనాలిరూరల్: జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాలతో మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డి. శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సివిలు, భరణం, బ్యాంకు దావాలు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

విధులలో అలసత్వం వీడండి

తెనాలిఅర్బన్: విధి నిర్వహణలో అలసత్వం విడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మారీసుపేటలోని 9వ శానిటరీ డివిజన్ కార్యాలయాన్ని బుధవారం తెల్లవారుజామున తనిఖీ చేశారు. అటెండెన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అందరూ సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు ఉన్నారు.

కోడి పందెం నిర్వాహకులపై కేసు నమోదు

కొల్లిపర: మండల పరిధిలోని కుంచవరం గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్న నలుగురుని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు.బుధవారం ఆయన మాట్లాడుతూ పందేలు నిర్వహిస్తున్న వారి వద్ద నుండి రూ.5వేలు, ఒక కోడి, 7మోటార్ బైక్స్ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. జూదం, కోడిపందేలు వంటి కార్యక్రమాలు నిర్వహించరాదని, ఎవరైనా కాదు చట్టం కు విరుద్ధంగా నిర్వహిస్తే అటు వంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తాతరావు, అశోక్, విజయ్ తదితరలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి కల్యాణం

కొల్లిపర: స్థానిక కృష్ణానది ఒడ్డున వేంచేసియున్న లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య స్వామి వార్ల కల్యాణ మహోత్సవం బుధవారం భక్తులు, అర్చకులు కమిటీ వారు ఘనంగా నిర్వహించారు. తూములూరు గ్రామానికి చెందిన ఈద వెంకటరెడ్డి, అనురాధ దంపతుల చేతుల మీదగా వేద పండితులు అమ్మవారి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పన్నుల వసూలుకు సహకరించండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు

తెనాలిఅర్బన్: ఇంటి, ఖాళీ స్థల, కుళాయి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధికి తోడ్పాటును అందించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు సూచించారు. పన్నుల వసూల్లో భాగంగా సుల్తానాబాద్‌లో బుధవారం ఆయన పర్యటించారు. పన్నులు చెల్లించని వారిని కలిసి వాటిని చెల్లించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పన్నుల వసూలును వేగవంతం చేశామని తెలిపారు.

డ్రంక్-డ్రైవ్ కేసులో జరిమానా

తెనాలిరూరల్: డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరికి రూ. 10 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. తెనాలి వన్ టౌన్ సీఐ వి. మల్లికార్జునరావు ఈ నెల 10వ తేదీ రాత్రి వాహనాలను తనిఖీ చేశారు. పట్టణానికి చెందిన మెడతాటి సునీల్‌కుమార్, కొవరపు ఉదయ్‌శంకర్‌లు మద్యంతాగి వాహనాలను నడుపుతున్నట్టు గుర్తించి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. ఇద్దరిని బుధవారం ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. వివేక్ వర్ధన్ ఎదుట హాజరుపరచగా న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు రూ. 10 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాలి ఉంటుందని హెచ్చరించారు.

చేయి తడుపుకో..! భవనాలు నిర్మించుకో!!

- తెనాలిలో పెరిగిపోతున్న ఆక్రమ కట్టడాలు
- నిబంధలకు నీళ్లు వదులుతున్న అధికారులు
- టౌన్ ప్లానింగ్‌లో కీలకంగా వ్యవహరిస్తున్న అధికారి
- నామమాత్రపు చర్యలతో "మమ" అనిపిస్తున్న అధికారులు



తెనాలిఅర్బన్: పట్టణంలో అక్రమ కట్టడాల పరంపర కొనసాగుతోంది. ప్రభుత్వ నిబంధనలకు కొందరు అధికారులు నీళ్లు వదులుతూ అందినంత దోచుకునే పనిలో పడ్డారు. వీటిపై ఎవరైన ఫిర్యాదులు చేస్తే నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు మిన్నకుండటం పలు విమర్శలకు తావిస్తోంది. పట్టణంలో గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా రెండు అంతస్తులకు మున్సిపల్ అధికారులు అనుమతులు ఇస్తుంటారు. మూడవ అంతస్తు నుంచి అయిదవ అంతస్తు వరకు సీఆర్‌డీఏ అనుమతులు తెచ్చుకోవాల్సి ఉంటుంది. తెనాలిలో నెలకు సగటున 30 నుంచి 35 భవనాలకు అనుమతులు ఇస్తుంటారు. అంటే ఏడాదికి సుమారు 400 భవనాలకు అనుమతులు ఇస్తుంటారు. ప్రస్తుతం తెనాలి పట్టణంలో సుమారు 15 వేల నివాస గృహాలు ఉన్నాయి.

ఆ.. అధికారే కీలకం!

తెనాలి పురపాలక సంఘంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసే ఓ అధికారి కీలకంగా మారాడు. పట్టణంలో ఎటువంటి అపార్ట్‌మెంట్‌లు, వ్యక్తిగత గృహాలు నిర్మించుకోవాలన్న అతనితో మాట్లాడుకుంటే చాలు ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే భవన నిర్మాణాలు జరుపుకోవచ్చు అనే ప్రచారం పట్టణంలో జోరుగా సాగుతోంది. ఉదాహరణకు... ఇటీవల మారీసుపేటలో మూడోవ అంతస్తును ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించారు. కానీ ఏఒక్క అధికారి కూడా దానిని ఆపలేదు. దీనికి కారణం రూ.లక్ష చేతులు మారాయనే ఆరోపణ విన్పించింది. అలాగే అయితానగర్‌లో ఇటీవల మూడొవ అంతస్తు నిర్మించేందుకు సెంట్రింగ్ ఏర్పాటు చేశారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడకు వెళ్ళి శ్లాబ్ వేయకూడదని సూచించారు. మరుసటిరోజు యజమాని ఆ అధికారిని కలవటం... శ్లాబ్ వేయటం చకచకా జరిగిపోయాయి. అలాగే ఇటీవల ఓ భవనానికి సంబంధించిన లావాదేవీలు హోటల్‌లో జరిగినట్లు సమాచారం.. ఇలా చెప్పుకుంటూ పోతే తెనాలి పట్టణంలో అనధికార కట్టడాలు కోకొల్లలే అని చెప్పవచ్చు.

మంత్రి ఆదేశాలకు తూట్లు

తెనాలి శాసన సభ్యులుగా నాదెండ్ల మనోహర్ గెలిచిన వెంటనే తెనాలిలో ఎటువంటి అనధికార కట్టడాలు జరపవద్దని.. అలా జరిగితే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులను హెచ్చరించారు. మొదట్లో టౌన్ ప్లానింగ్ అధికారులు కొంత కఠినంగా వ్యవహరించారు. నెలలు దాటే కొద్ది వారిలో మార్పు వచ్చింది. ఇప్పటి నుంచి అనధికార కట్టడాలకు లోపాయికారి అనుమతులు ఇవ్వటం వంటివి చేస్తున్నారు. ఇప్పటికైన పాలకులు, మున్సిపల్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తెనాలిలో జరుగుతున్న అనధికార కట్టడాలకు అడ్డుకట్టవేయాలి. అలాగే కొందరు అధికారుల దోపిడీని అరికట్టడంతో పాటు విజిలెన్స్ విచారణ జరిపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిబంధనలకు 'టౌన్ ప్లానింగ్' సరికొత్త భాష్యం

ఇటీవల కాలంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పోకడ వింతగా ఉంటుంది. అనధికార కట్టడాలను పూర్తిగా తొలగించాల్సి ఉంటుంది. కానీ తెనాలిలో అలా జరగటంలేదు. అనధికారికంగా భవనాలను నిర్మించదలచిన వారు ముందుగా కీలకంగా మారిన అధికారిని కలుస్తున్నారు. ఆయన వ్యక్తిగత గృహానికి రూ.లక్ష, అపార్ట్‌మెంట్‌కు రూ.5 లక్షల చొప్పున తీసుకుంటున్నాడు. వీటిపై ఫిర్యాదులు వస్తే తామే దానిని పడగొడ్డటానికి వస్తామని, పిల్లర్స్, శ్లాబ్‌కు రంధ్రం వేసి వెళ్తామని కంగారు పడవద్దని ముందుగా యజమానులకు చెప్తున్నారు. మరమ్మతులు చేయించుకుంటే భవనం పూర్తి అవుతుందనే ఆశతో దానికి యజమానులు అంగీకరించి నగదు ముట్టజెబుతున్నారు. దీంతో అటు యజమాని ఇటు అధికారులు సేఫ్ అన్న చందన్న తెనాలిలో జరుగుతుంది.



ప్రకాశం రోడ్డులో నిర్మాణదశలో ఉన్న భవనం

నోటీసులతో సరిపుచ్చుతూ..

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరైనా ఇంటి నిర్మాణాలు జరుపుతున్నట్లు తెలిస్తే వెంటనే ఆపాల్సి ఉంటుంది. అప్పటికే నిర్మాణాలు జరిపి ఉంటే యజమానులకు నోటీసులు ఇవ్వటంతో పాటు కోర్టులో కేసులు వేయాల్సి ఉంటుంది. న్యాయమూర్తులు యజమానులు భారీ అపరాధ రుసుంను విధిస్తారు. అవసరమనుకుంటే జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉన్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. కానీ తెనాలిలోని ప్రకాశంరోడ్డు, నందులపేట, నాజరుపేట, కొత్తపేట తదితర ప్రాంతాలలో అనేక అపార్ట్‌మెంట్‌లను ఇటీవల నిర్మించారు. అధికారులు నోటీసులతో సరిపుచ్చారు.



నాజరుపేటలో నిర్మాణాలు

అనధికార కట్టడాలను ఉపేక్షించం



తెనాలి పట్టణంలో అనధికార కట్టడాలను ఉపేక్షించం. తమ దృష్టికి వచ్చిన వాటిని పగలకొట్టాలని ఆదేశించి ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. అలాగే దానికి బాధ్యులైన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇస్తున్నాం. అంతటితో ఆగకుండా భవన యజమానులపై కోర్టులో కేసులు పెట్టిస్తున్నాం. భవన నిర్మాణాలు జరపదలచిన వారు తమను సంప్రదిస్తే ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఇస్తాం.

–బండి శేషన్న, కమిషనర్, తెనాలి పురపాలక సంఘం.

కళాకారులకు ఉచిత వైద్యశిబిరం

- 200 మందికి ఉచితంగా కంటి పరీక్షలు
- అవసరమైన వారికి కళ్లజోళ్లు, ఆపరేషన్లు

తెనాలి: పట్టణానికి చెందిన ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం కళాకారుల కోసం ప్రత్యేకంగా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీసీ కాలనీలోని కళాకారుల సంఘం భవనంలో జరిగిన శిబిరంలో హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు అనుబంధంగా గూడవల్లిలో గల డాక్టర్ కొమ్మారెడ్డి రాజారామమోహనరావు నేత్రవైద్య కేంద్రానికి చెందిన వైద్యసిబ్బంది కంటి పరీక్షలు చేశారు.

దాదాపు రెండువందల మంది కళాకారులు పాల్గొన్నారు. ప్రముఖ సినీ రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ వైద్యపరీక్షలు చేయించుకున్నవారిలో అవసరమైన వారికి పదిరోజుల్లో కళాకారుల సంఘం తరపున ఉచితంగా కళ్లజోళ్లు అందజేస్తామని చెప్పారు. శుక్లాల ఆపరేషనును ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రితో ఉచితంగా చేయిస్తామని చెప్పారు. ఈదర రామారావు ట్రస్ట్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్ మాట్లాడుతూ, వైద్యశిబిరంతో కళాకారులకు సేవ చేయడం అదృష్టంగా చెప్పారు. వైద్యసిబ్బంది వి.వెంకట్, నవీన్, రంజిత్, సుచిత్ర పరీక్షలు చేశారు. కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, గౌరవ అధ్యక్షుడు ఆరాధ్యుల కోటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ గరికపాటి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి ఆరాధ్యుల ఆదినారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి మేరిగ రామలింగేశ్వరరావు, కోశాధికారి దీపాల సుబ్రహ్మణ్యం చెరుకుమల్లి సింగారావు, షేక్ జానిబాషా, దేవరపల్లి భవాని, కనపర్తి మధుకర్, రోటరీ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, గుత్తా వెంకటరత్నం, కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు తదితరులు పర్యవేక్షించారు.

అసత్య ఆరోపణలు నమ్మొద్దు

తనపై వచ్చిన అవినీతి ఆరోపణలను ఖండించిన తహసీల్దార్



రెవెన్యూ రికార్డులను చూపుతున్న తహసీల్దార్

తెనాలిరూరల్: భూ సమస్య పరిష్కారంలో తనపై వచ్చిన అవినీతి ఆరోపణలను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తీవ్రంగా ఖండించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివాదం పూర్తి వివరాలను తెలిపారు. ఆయన కథనం మేరకు.. అనమర్లపూడి గ్రామానికి చెందిన బొద్దులూరి కిరణ్‌కు కొలకలూరు పరిధిలో 87 సెంట్లు భూమి ఉంది. దానికి సంబంధించి గుడివాడ గ్రామానికి చెందిన గరికపాటి లింగారావుతో వివాదం ఉంది. దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్య పరిష్కారం కాకపోవడంతో కిరణ్ జిల్లా కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దానిపై కలెక్టర్ ఆదేశాల మేరకు భూ రికార్డులను పరిశీలించి, క్షేత్ర స్థాయిలోనూ విచారణ జరిపి, రెవెన్యూ కోర్టులో మూడు వాయిదాలలో ఇరుపార్టీల వాదనలను విన్నట్లు చెప్పారు. అనంతరం నిబంధనలకు లోబడి గత ఏడాది ఆగస్టు 30న విచారణ ఆధారంగా ఉత్తర్వులు జారీ చేశామని, అయితే సివిల్ కోర్టులో అదే భూమికి సంబంధించిన వివాదం ఉందని, దానిలో తహసీల్దార్ బాధ్యులుగా లేరని, ఈ నేపథ్యంలో కోర్టు తీర్పుకు లోబడి ఉత్తర్వుల అమలయ్యేలా ఆదేశించినట్లు చెప్పారు. అయితే ఈ విషయంలో అక్రమాలకు పాల్పడినట్లు ఓ యూట్యూబ్ ఛానల్‌లో కథనం ప్రచురితమైందని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. తాను తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇప్పటివరకు 18,388 అర్జీలు పరిష్కరించామని, అదే విధంగా 5800 మంది రైతులకు సంబంధించి సుదీర్ఘ కాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యను మంత్రి నాదెండ్ల మనోహర్, ఉన్నతాధికారుల సహకారంతో తాను పరిష్కరించినట్లు గుర్తు చేశారు. అయితే ఎక్కడా ఎలాంటి అవినీతికి తావు లేదన్నారు. ప్రజలు అపోహలను నమ్మొద్దని రెవెన్యూ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ విషయంలో గుడివాడ సర్పంచ్ యడ్లపాటి రాకేష్, పలువురు రైతులు తనకు పూర్తి సహకారం అందించి అండగా నిలిచినట్లు చెప్పారు. సమావేశంలో రూరల్ ఎస్‌ఐ ప్రతాప్‌కుమార్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

15న జరిగే సోర్స్-రిసోర్స్ కార్యక్రమంలో పాల్గొనాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



మాట్లాడుతున్న కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్: స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీన సోర్స్ - రీసోర్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా షెడ్డులో బుధవారం సాయంత్రం ఆరోగ్య విభాగ ఉద్యోగులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. ప్రతి నెల 3వ శనివారం పారిశుద్ధ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ప్రజలు వీటిలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతిరావు, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మలాలు మాట్లాడుతూ పారిశుద్ధ్య మెరుగుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. రోడ్లపై ప్రజలు చెత్తను వేయకుండా కార్మికులకు అందజేయాలని సూచించారు. సమావేశంలో పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, నగరదీపికలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ మద్యపాన ప్రియులకు జరిమానా

తెనాలిరూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారికి న్యాయమూర్తి జరిమానా విధించారు. తెనాలి టూ టౌన్ సీఐ రాములు నాయక్ ఈ నెల 10వ తేదీన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. బహిరంగంగా మద్యం తాగుతున్న 14 మందిపై కేసులు నమోదు చేశారు. అలానే మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు నుండి వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపరచగా, బహిరంగంగా మద్యం తాగుతున్న 14 మందికి రూ. వెయ్యి చొప్పున, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురికి రూ. 10 వేల చొప్పున జరిమానా విధించారు.

రేపు సంస్కృత కళాశాల పూర్వవిద్యార్థుల వార్షికోత్సవం



ఆహ్వానపత్రికను ఆవిష్కరించిన పూర్వవిద్యార్థులు

తెనాలి: పట్టణంలోని శతవసంతాలకు పైగా సంస్కృత విద్యను అందించిన కోట లక్ష్మయ్యనాయుడు సంస్కృత కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ప్రథమ వార్షికోత్సవం ఈనెల 16న తెనాలిలో జరగనుంది. కొత్తపేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ హాలులో ఆరోజు సాయంత్రం నాలుగు గంటలకు ఆరంభమయే వార్షికోత్సవం ఆహ్వానపత్రికను బుధవారం అక్కడే ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆవిష్కరించారు. సంఘ బాధ్యులు సి.వినాయకరావు మాట్లాడుతూ వందేళ్లకు పైగా ఎందరో పండితులను తీర్చిదిద్దిన సంస్కృత పాఠశాల పూర్వవిద్యార్థులం గతేడాది ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నట్టు గుర్తుచేశారు. ఆనాటి నిర్ణయం ప్రకారం పూర్వవిద్యార్థులు తమ వివరాలు, అనుభవాలు, జ్ఞాపకాలను 'మనోరమ' పేరుతో ప్రత్యేక సంచికను తీసుకొచ్చినట్టు చెప్పారు. ప్రఖ్యాత ఆగమశాస్త్రకోవిదుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి వార్షికోత్సవ వేడుకల్లో మనోరమ పుస్తక ఆవిష్కరణ జరుగుతుందని చెప్పారు. కాలేజీకి ప్రిన్సిపాల్‌గా చేసిన ప్రఖ్యాత ప్రవచనకర్త బ్రహ్మశ్రీ మైలవరపు శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని, పూర్వవిద్యార్థులంతా హాజరుకావాలని కోరారు. మరో పూర్వవిద్యార్థి దేవయజనం మురళీకృష్ణ మాట్లాడుతూ సంస్కృత కళాశాలలో 'మనోరమ' పేరుతో వార్షికోత్స రాతపత్రిని తీసుకొచ్చేవారమని గుర్తుచేసుకున్నారు. పూర్వవిద్యార్థుల ప్రత్యేక సంచికకు అదే పేరుతో నామకరణం చేశామని తెలిపారు. ఆహ్వానపత్రిక ఆవిష్కరణలో సీహెచ్ రామలింగేశ్వరరావు, ఈఎల్‌వీ అప్పారావు, లక్కరాజు లక్ష్మణరావు, మేడూరి శ్రీనివాసమూర్తి, ఆమంచి సూర్యనారాయణ పాల్గొన్నారు.

భూములున్న రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



రిజిస్ట్రేషన్ పక్రియను పరిశీలిస్తున్న ఏవో వెంకటరావు

కొల్లిపర: మండలంలో వ్యవసాయ భూమి ఉన్న యజమానులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాష్ట్ర రైతుల రిజిస్ట్రేషన్ కార్యక్రమం ద్వారా వారి వివరాలు నమోదు చేసుకుని 11అంకెలుగల రైతు గుర్తింపు నెంబరు పొందాలని ఏవో కె.వెంకటరావు తెలిపారు. బుధవారం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రిజిస్ట్రేషన్ కార్యక్రమం వ్యవసాయ శాఖ రెవెన్యూ శాఖ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు ఈ రిజిస్ట్రేషన్ వల్ల వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీ పథకాలు, పంట రుణాలు, పంటల బీమా, పంట కొనుగోలు వంటి కార్యక్రమాలు రిజిస్ట్రేషన్ ద్వారా వచ్చిన 11 అంకెల ద్వారా మాత్రమే నమోదు చేయటం జరుగుతుందని తెలిపారు. రైతులు నమోదు కోసం ఆధార్ కార్డు,ఆధార్ కు లింకు అయిన మొబైల్, పట్టాదారు పాస్ బుక్ తీసుకుని మీ రైతు సేవా కేంద్రంకు వెళ్లి నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని మండలంలోని వివిధ గ్రామాలలోని పంట భూములు కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేశం కోసం మనం !

అలకించని జనాల నడుమ గాంధీ భక్తుడి ప్రచారం



బోసురోడ్డులోని కూడలిలో నాగరాజన్ ప్రసంగం

తెనాలి: మధ్యాహ్నం ఒకటిన్నర గంటలు... బోసు రోడ్డులో రైతుబజార్ సమీప నాలుగు రోడ్ల కూడలి. ఒకవైపు ఇందిరాగాంధీ విగ్రహం ఎప్పటిలాగే ఉంది. భోజనం వేళ కావటంతో జనం హడావుడిగా వాహనాలపై వెళుతున్నారు. ఒక పక్కగా ట్రక్ ఆటో...అందులో గాంధీ వేషధారణతో ఒకరు మైకులో గాంధీ–అంబేడ్కర్ సిద్ధాంతాలను ఏకరువు పెడుతున్నారు. పక్కన గాంధీ టోపీలతో మరో ముగ్గురు మహిళలు...అంతా ఎవరి దారిని వారు వెళుతున్నారు మినహా...ఆగి అలకించినవారు లేరు. 'దండియాత్ర-2' పేరుతో ఆటోకు రెండువైపులా ఫ్లెక్సీలు న్నాయి. 'స్త్రీలకు, ప్రజాస్వామ్యానికి సంపూర్ణ మద్యపాన నిషేధమే రక్షణ కవచం, 'ఆర్టికల్–47 ప్రకారం ప్రభుత్వాలు మద్యపానం, మత్తుపానీయాలు నిషేధించాలి, రౌడీయిజం నశింపజేయాలి. ఏ పార్టీలోనైనా క్రిమినల్స్‌కు ఓటు వేయరాదు..' నినాదాలున్నాయి. పట్టణ రామలింగేశ్వరపేటకు చెందిన అతడి పేరు నాగరాజు. తండ్రి పేరును కూడా కలుపుకుని రామిశెట్టి రామచంద్రన్ నాగరాజన్‌గా నామకరణం చేసుకున్నారు. గాంధీ స్ఫూర్తితో గాంధీ దేశం వెల్ఫేర్ ట్రస్టును స్థాపించి, గాంధీ, అంబేడ్కర్ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రచారం చేస్తున్నారు. అందులో భాగంగానే ఊరూరూ తిరుగుతూ ప్రచారం సాగిస్తున్నారు. ఆ క్రమంలోనే బుధవారం పట్టణంలోని పలు వీధుల్లో ఆయన ప్రచార కార్యక్రమం నిర్వహించారు. 'బతుకుదాం, బతికిద్దాం, బతికించడం కోసం బతుకుదాం...అంటూ స్వార్థ రాజకీయనాయకులకు ఓటు వేయొద్దని చాటుతున్నాడు. ఓటును అమ్ముకోవద్దనీ, డబ్బును ప్రేమించే నాయకులు జనాల్ని ప్రేమించలేరనీ చెప్పారు. మతసామరస్యాన్ని పాటించండి...బతికితే దేశం కోసమే బతకాలి...ఛస్తే దేశం కోసమే చావాలి'...అంటూ ఉద్వేగంగా ఆయన ప్రసంగించారు. గతంలో రైతు నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించారు. విజయవాడలో ఆమరణదీక్షకు పూనుకుని అరెస్టయ్యారు. మణిపూర్ దురంతాలపైనా దీక్షలు చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన గాంధీజీ దండియాత్ర స్ఫూర్తితో ఒంటరి ప్రచారంతో గడుపుతున్నారు. ఎవరూ ఆలకించటం లేదని ఆయనకు తెలుసు...అయినా తన వంతు కర్తవ్యం...అనుకుంటూ మంచి ఎండలోనూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

జేఈఈ మెయిన్స్‌లో చైతన్య విద్యార్థుల ప్రతిభ



అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ తిరుపతిరావు

తెనాలిఅర్బన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తెనాలిలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు ఐదుగురు అత్యధిక మార్కులు సాధించారని ప్రిన్సిపల్ బి.తిరుపతిరావు తెలిపారు. వై.వంశీ ఆదిత్యకు 99.02 శాతం, ఐ.శివశంకర్ 97.75శాతం, కె.యశ్వత్ 96.01 శాతం మార్కులు సాధించారని చెప్పారు. వీరిని కళాశాల ఆవరణలో బుధవారం అభినందించారు. కార్యక్రమంలో ఏవో వెంకటరాయుడు, పలువురు అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంత పెద్ద కొండచిలువో!



మండల పరిధిలో పిడపర్తి పాలెంలో బండికల్ల ఆధాం చెందిన నిమ్మతోటలో బుధవారం ఉదయం 9 గంటల సమయంలో పనులు నిమిత్తం కూలీలతో వెళ్లగా పంట పొలంలో భారీ కొండ చిలువ బుసలు కొడుతూ కనిపించింది. కాస్సేపు భయపెట్టినా చివరకు దాన్ని చాకచక్యంగా పట్టుకుని కృష్ణా నదిలో పారుదల ఉన్న నీటిలో వదిలి పెట్టారు. కృష్ణమ్మ వరద సమయంలో ఇవి వచ్చి ఉంటాయని, ఇప్పటికే గ్రామంలో మూడు కొండ చిలువ లు ఈ విధంగా కనిపించినట్లు తెలిపారు.

–పిడపర్తి పాలెం (కొల్లిపర)

క్షయ వ్యాధిగ్రస్తులకు నిత్యావసరాలు పంపిణీ



తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి సోకిన వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యశాలలోని పీపీ యూనిట్ వైద్యురాలు డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగి ముక్కాల వీరయ్య ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు బుధవారం పాత ప్రభుత్వ వైద్యశాలలో నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మందులను సక్రమంగా వాడకుంటే క్షయ పూర్తిగా తగ్గే అవకాశం ఉందన్నారు. దాతలు ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ డాక్టర్ పల్లెకొండ రవికుమార్, మలేరియా అధికారులు అందె బాలచంద్ర మౌళి, శ్రీకంఠ ఉమాకాంత్, సోషల్ వర్కర్ ప్రవీణ్‌పాల్, తదితరులు పాల్గొన్నారు.